గుంతలమయంగా రోడ్లు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- వర్షాలతో దెబ్బతిన్న రోడ్లు
- తరచూ జరుగుతున్న ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారుల్లో చాలా ప్రాంతాల్లో రోడ్లు గుంతలమయంగా మారాయి. జిల్లా కేంద్రంలోనే ఈ పరిస్థితి ఉంటే కాలనీలలో ఉన్న రోడ్ల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. గుంతల వలన తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వద్ద మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. నాలుగు నెలల క్రితం కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని పలు ప్రాంతాలలో రోడ్డులు దెబ్బతినగా కేవలం తాత్కాలిక మరమ్మతులు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు.

మానుకోట మున్సిపాలిటీ పరిధిలో 36వార్డులు ఉండగా 68,889 మంది జనాభా, 57,828 మంది ఓటర్లు ఉన్నారు. 25,000లకు పైగా గృహాలు ఉన్నాయి. విద్యా, వ్యాపారం, ఇతరత్రా పనుల నిమిత్తం మానుకోటలో నివాసం ఉండే వారితో కల్పితే లక్ష జనాభా దాటుతుంది. మున్సిపల్ రోడ్డు సుమారు 280కిలోమీటర్ల పైనే ఉంటాయని అధికారులు తెలిపారు. వాటితోపాటు ఎన్‌హెచ్ రోడ్లు, ఆర్అండ్‌బీలు కూడా ఉన్నాయి.

భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు

2024 సెప్టెంబర్ మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలకు మానుకోట జిల్లాలోని చాలా రోడ్లు దెబ్బతిన్నాయి. జిల్లా కేంద్రంను పరిశీలిస్తే బంధం చెరువు వద్ద ఆర్వోబీ ప్రాంతంలో మున్నేరు వాగు వద్ద రోడ్లు చాలా వరకు దెబ్బతిన్నాయి. ఆ రోడ్లకు కేవలం తాత్కాలిక మరమ్మతు పనులు మాత్రమే చేశారు. కొత్త బజార్‌లోని శ్రీనివాస థియేటర్ సమీపంలో ఉన్న రోడ్డు, రామమందిరం సమీపంలో రోడ్డు గుంతలు పడ్డాయి. మోడల్ మార్కెట్ ఎదుట, గ్రంథాలయం ఎదుట, బంధం చెరువు సమీపంలో ఉన్న రోడ్లు కూడా కొంత మేరకు దెబ్బతిన్నాయి. పాత బజార్‌లోని పలు ప్రాంతాలలో రోడ్డు గుంతలమయంగా మారింది.


శ్రీనివాస థియేటర్ సెంటర్‌లో గుంతలమయంగా ఉన్న రోడ్డు


రామమందిరం సమీపంలో ప్రమాదకరంగా రోడ్డుపై గుంత


బంధం చెరువు వద్ద రోడ్డు కొట్టుకుపోగా చేసిన తాత్కాలిక మరమ్మతులు


భారీ వర్షాలకు ఆర్వోబీ కింద రోడ్డు కొట్టుకుపోగా పక్కన ఏర్పడిన గుంత

బహుజన చక్రవర్తి సర్వాయి పాపన్న

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్: సర్దార్ సర్వాయి పాపన్న ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని ఎమ్మెల్యే మురళీనాయక్ పిలుపునిచ్చారు. పాపన్న విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని కురవి రోడ్డులో విగ్రహ ఏర్పాటు కోసం నిర్వహించిన భూమి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న అని ఆయన జీవిత చరిత్రను అధ్యయనం చేయాలన్నారు. ఎమ్మెల్సీ రవీందర్‌రావు మాట్లాడుతూ.. త్వరగా విగ్రాహ ఏర్పాటు పనులు పూర్తి చేసి ఆవిష్కరణ కార్యక్రమంను ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, ఫ్లోర్ లీడర్లు అజయ్‌సారధి రెడ్డి, సూర్నపు సోమయ్య, జనార్దన్ పాల్గొన్నారు.

అర్హులకే సంక్షేమ పథకాలు

కేసముద్రం: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే రాష్ట్రప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని బేరువాడ గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో ఆయన మాట్లాడారు. అనంతరం మహమముద్‌పట్నం గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఇనుగుర్తి మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో వద్దిరాజు నారాయణ-వెంకటనర్సమ్మ జ్ఞాపకార్థంగా వద్దిరాజు సోదరుల, కటికనేని నేహల్‌బాబు దాతల సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

వచ్చే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గణపతి ఫంక్షన్ హాల్‌లో జరిగిన పార్టీ నాయకుల, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డీసీసీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


మహబూబాబాద్: భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

డ్రై పోర్ట్‌తో డోర్నకల్ అభివృద్ధి

డోర్నకల్: డోర్నకల్ ప్రాంతంలో డ్రై పోర్ట్ ఏర్పాటైతే ఈ ప్రాంతం పూర్తిగా అభివృద్ధి చెందుతుందని డోర్నకల్ మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. డ్రైపోర్ట్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ పట్టుదలతో ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు సుమేర్ చంద్‌జైన్, మాదా శ్రీనివాస్, తారాచంద్, రెడ్డెబోయిన శంకర్ పాల్గొన్నారు.

పన్నుల తగ్గింపునకు చర్య తీసుకోవాలి

తొర్రూరు: మున్సిపాలిటీలో భారీగా పెంచిన వాణిజ్య పన్నులను తగ్గించాలని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మచ్చ సురేష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో వ్యాపారులు చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, కమిషనర్ శాంతికుమార్‌లకు వినతిపత్రం సమర్పించారు. సురేష్ మాట్లాడుతూ.. పన్నుల పెంపుదలతో వ్యాపారులపై ఆర్థికభారం పడుతోందని, కొంత కాలంగా వ్యాపారాలు పట్టణంలో మందకొడిగా సాగుతున్నాయన్నారు. ఇంటి పన్నులు, గృహేతర పన్నులతో వ్యాపారులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు పెరుమాండ్ల చక్రపాణి, చలువాది సత్యనారాయణ, చిదురాల శ్రీనివాస్, వ్యాపారులు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న వ్యాపారులు

వందేళ్ల ప్రజాపోరాట చరిత్ర సీపీఐదే

- పార్టీ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి

నెహ్రూసెంటర్: దేశంలో తెలంగాణ సాయుధ పోరాటం మొదలు అనేక ప్రజా పోరాటాలు నిర్వహించి విజయం సాధించిన వందేళ్ల ప్రజాపోరాట చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సీపీఐ అని పార్టీ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమం, రైతాంగ సాయుధ పోరాటాన్ని నడిపిన చరిత్ర పార్టీకే దక్కుతుందన్నారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నేడు జిల్లా కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెప్టెంబర్ 17 స్ఫూర్తి చిహ్నం, మానుకోట మాజీ ఎమ్మెల్యే తీగల సత్యనారాయణరావు విగ్రహావిష్కరణ, బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, పార్టీ శ్రేణులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, మామిళ్ల సాంబలక్ష్మీ, కట్లోజు పాండురంగాచారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయసారథి

కమిటీల ప్రమేయాన్ని నివారించాలి


వినతిపత్రం అందిస్తున్న వెంకటేశ్వర్‌రావు

డోర్నకల్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఇందిరమ్మ కమిటీల ప్రమేయాన్ని తొలగించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యలమంచలి వెంకటేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. మండలంలోని తహసీల్దారు బంజర గ్రామంలో శుక్రవారం ఎంపీడీఓ శ్రీనివాస నాయక్‌కు వినతిపత్రం అందించిన అనంతరం వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిధులకు సంబంధించి ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా ఎక్కువ నిధులను ఎన్‌డీఏ ప్రభుత్వం కేటాయిస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు బానోత్ గణేష్‌నాయక్, పట్టణ అధ్యక్షులు గుగులోత్ దేవానాయక్, తదితరులు పాల్గొన్నారు.

బైండోవర్ ఉల్లంఘన.. రూ.50వేల జరిమానా

కేసముద్రం: బైండోవర్ ఉల్లంగించిన ఓ వ్యక్తికి రూ.50వేల జరిమానా విధించినట్లు గూడూరు ఎక్సైజ్ సీఐ భిక్షపతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారంగా.. మండలంలోని పెనుగొండ గ్రామానికి చెందిన నలమాస గోవర్ధన్ బైండోవర్ నియమాలను ఉల్లంగించినందుకు రూ.50వేల జరిమానా విధించినట్లు తెలిపారు. అంతకు ముందు మెగ్యాతండాలో గుడుంబాస్థావరాలపై దాడులు చేయగా, 22 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, నలుగురిపై కేసు నమోదు చేసి, తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు.

ఇనుప చువ్వతో వ్యక్తిపై దాడి

మరిపెడ రూరల్: డబ్బులు ఇవ్వాలని నిలదీసినందుకు ఓ వ్యక్తిని మరో వ్యక్తి ఇనుప చువ్వతో దాడి చేసి గాయపర్చాడు. ఈ సంఘటన మండలంలోని ఎడ్జెర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని పూసలతండాలో చోటుచేసుకోగా శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. కథనం ప్రకారం.. పూసలతండాకు చెందిన భూక్య శ్రీను సుతారి మేస్త్రిగా చేస్తున్నాడు. ఈక్రమంలో అదే తండాకు చెందిన బాదావత్ గోప్య ఇంటి నిర్మాణంలో గత ఏడాది పని చేశాడు. అదే విషయంపై తండాలో కలిసిన గోప్యను డబ్బులు ఇవ్వాలని నిలదీశాడు. దీంతో ఒక్కసారిగా కోపోద్రుక్తుడైన గోప్య పక్కనే ఉన్న ఇనుప చువ్వతో శ్రీనుపై దాడి చేడి చేసి వెనుక భాగంలో పొడిచాడు. తీవ్రగాయాలై రక్తస్రావం అవుతున్న శ్రీను ఖమ్మం ఆస్పత్రి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయంపై మరిపెడ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేసినట్లు బాధితుడి సోదరుడు భూక్య రవి తెలిపాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కురవి: రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని నల్లెల్ల స్టేజీ సమీపంలో 365/ఏ ఖమ్మం జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన పొద్దిళ్ల తేజ అనే యువకుడు బైక్‌పై కురవికి వస్తున్నాడు. ఈక్రమంలో నల్లెల్ల స్టేజీ సమీపంలో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన కిందపడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో 108 అంబులెన్స్‌లో ఈఎంటీ రేణుక, పైలట్ జక్కుల వీరన్న వాహనంలో ఎక్కించుకుని మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

చేపల వేటకు వెళ్లి చెరువులో వ్యక్తి మృతి

గార్ల: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలోని పుల్లూరు చెరువులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం చీమ్లాతండాకు చెందిన గుగులోత్ రాములు(60) తండా శివారులోని గార్ల మండలం పుల్లూరు చెరువులో చేపల వేటకు వెళ్లాడు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. మృతుడి కుమారుడు గుగులోత్ ప్రసాద్ ఫిర్యాదు మేరకు ఎస్సై ఎస్‌కె రియాజ్‌పాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

గాయపడిన వృద్ధురాలి మృతి

మరిపెడ రూరల్: మండలంలోని పురుషోత్తమాయగూడెం స్టేజి వద్ద గురువారం పల్సర్ బైకు ఆటో ను ఢీకొట్టింది. తీవ్రగాయాలైన మండలంలోని వీరారం గ్రామానికి చెందిన కొండెబోయిన పుల్లమ్మ (65) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందింది.

చివరి రోజు.. అదే హోరు

ముగిసిన గ్రామసభలు

ప్రజాపాలన గ్రామసభల ముగింపు రోజైన శుక్రవారం సైతం గొడవలు, వాగ్వాదాలు జరిగాయి. అర్హులైన వారి పేర్లను అధికారులు చదివి వినిపించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేలు మురళీనాయక్, రాంచంద్రునాయక్ మాట్లాడుతూ.. జాబితాలో పేర్లు రాని వారు అధైర్యపడవద్దని అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

- సాక్షి నెట్‌వర్క్


కేసముద్రం: బేరువాడ గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్


దంతాలపల్లి: రామానుజాపురం గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్


డోర్నకల్ వార్డు సభలో వాగ్వాదం


చిన్నగూడూరు గ్రామసభలో కంటతడి పెడుతున్న మహిళ


మహబూబాబాద్ అర్బన్: అధికారులతో వాగ్వాదం చేస్తున్న ప్రజలు


మరిపెడ రూరల్: లక్ష్మాతండాలో దరఖాస్తులు అందజేస్తున్న గ్రామస్తులు


కురవి: కందికొండలో గొడవ పడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు


బయ్యారం: లబ్ధిదారుల ఎంపికపై ప్రశ్నిస్తున్న స్థానికులు

సంక్షిప్త సమాచారం

28న వాహనాల వేలం

తొర్రూరు: ఎక్సైజ్ దాడుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 28న వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ ఏఈఎస్, తొర్రూరు ఇన్‌చార్జ్ రాజేశుని ప్రవీణ్ తెలిపారు. ఈనెల 28న ఉదయం 8గంటలకు ఎక్సైజ్ కార్యాలయంలో 50శాతం డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

నేత్రాల దానం

మరిపెడ/మరిపెడ రూరల్: చనిపోయిన వ్యక్తి నేత్రదానంతో అంధులైన ఇద్దరికి జీవితాల్లో వెలుగులు నింపవచ్చునని ఖమ్మం ఐ బ్యాంకు సెక్రటరీ ఆర్ఎ పద్మనాభం అన్నారు. మరిపెడ మున్సిపాలిటీకి చెందిన వుల్లి ప్రమీల (65) అనారోగ్యంతో శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆమె నేత్రాలను భర్త వుల్లి సోమయ్య, కుమారులు వుల్లి శేఖర్, వుల్లి శ్రీనివాస్ ఖమ్మం ఐ బ్యాంకుకు దానం చేశారు.

ఆడపిల్లలను చదివించాలి

గూడూరు: తల్లిదండ్రులు ఆడపిల్లలను తప్పకుండా చదివించాలని హెచ్ఎం పులి దేవేందర్ అన్నారు. మండలంలోని సీతానగరం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలిక విద్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. అనంతరం బాలికలకు యూనిఫాం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, హేమ్లు, రాజమౌళి, ఆరోగ్య ఉప కేంద్రం ఉద్యోగి రమ్య పాల్గొన్నారు.


ఆర్థిక చేయూత

గార్ల: గార్లలోని తహసీల్దార్ బజారుకు చెందిన నిరుపేద ముస్లిం మహిళ వివాహానికి గార్ల ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు రూ.50వేల విలువ గల సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో రహీం, యాకూబ్ పాషా, అఫ్జల్‌బేగ్, షబ్బీర్‌ఖాన్, శ్రీనివాస్, హతీరాం పాల్గొన్నారు.

గ్రామసభలో మహిళకు అస్వస్థత

దంతాలపల్లి: మండలం దొనకొండ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో గ్రామానికి చెందిన మమత తీవ్ర అస్వస్థకు గురైంది. చికిత్స నిమిత్తం 108లో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



కొత్తగూడ: మండలకేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వయంపరిపాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నీటివనరుల పరిశీలన

బయ్యారం: మండలంలోని పలు పంచాయతీల పరిధిలో ఉన్న నీటివనరులను వినియోగించుకోవడంపై శుక్రవారం కాంగ్రెస్ నాయకులు పరిశీలన చేశారు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచనల మేరకు ఇరిగేషన్ ఏఈతో కలిసి రామచంద్రాపురం, అల్లిగూడెం, కోయగూడెం పంచాయతీల పరిధిలో ఉన్న వాగులపై చెక్‌డ్యాంలు అవసరమున్న ప్రాంతాలను గుర్తించారు. కార్యక్రమంలో నాయకులు సోమేష్, రాంమూర్తిగౌడ్, వెంకటేశ్వర్లు, రమేష్, ప్రసాద్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

డోర్నకల్: డోర్నకల్, పాన్నెకల్ రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. మండలంలోని దుబ్బతండాకు చెందిన భాషా, సుజాత తమ కుమారుడిని ఇల్లెందు మండలం మూలపోచారం హాస్టల్‌లో వదిలి ద్విచక్రవాహనంపై వస్తుండగా పాన్నెకల్లు దాటి డోర్నకల్ సమీపిస్తుండగా ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొట్టడంతో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. 108 వాహనంలో క్షతగాత్రులను ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

తూతూ మంత్రంగా ఆడిట్ గ్రామసభలు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం రెండు రోజులుగా నిర్వహిస్తున్న మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ సోషల్ ఆడిట్ గ్రామసభలు తూతూ మంత్రంగా కొనసాగుతున్నాయి. మండలంలోని బావోజిగూడెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సోషల్ ఆడిట్ గ్రామసభలో కనీసం ప్రజలకు కూర్చీలు, టెంట్ ఏర్పాటు చేయకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పరికరాలకు దివ్యాంగుల ఎంపిక

కొత్తగూడ: దివ్యాంగులకు సరిపోయే పరికరాలు అందించేందు అలిమ్‌కో స్వచ్ఛంద సభ్యులు శుక్రవారం మండలకేంద్రంలో ఎంపిక చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రాజేష్, వెంకన్న, భిక్షపతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జ్యోతి, రామలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్స్, గ్లాసుల వితరణ

కురవి: సీరోలు మండలం కొత్తూరు(సీ) గ్రామంలోని ప్రాథమిక పాఠశాల పునఃప్రారంభం కావడంతో విద్యార్థులకు అవసరమైన ప్లేట్స్, గ్లాసులను మహబూబాద్ జిల్లా కలెక్టరేట్ క్యాంటీన్ నిర్వాహకుడు మద్దెల మధుసూదన్-ప్రసన్న దంపతులు శుక్రవారం అందించారు. 'సాక్షి' దినపత్రికలో ఈనెల 23న 'మళ్లీ నిలబడి' అనే శీర్షిక కథనం ప్రచురితం కావడంతో కథనం చూసి విద్యార్థులను ప్రోత్సహించాలని వాటిని అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, మంజీర, సీరోలు కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు వేణు పాల్గొన్నారు.


ప్లేట్స్, గ్లాసులు అందజేస్తున్న దాత

కూరగాయల సాగు లాభదాయకం

నెల్లికుదురు: వేసవి కాలంలో కూరగాయల సాగుతో రైతులు ఎంతో లాభాలు పొందొచ్చని ఉద్యాన పట్టు పరిశ్రమల శాఖ అధికారి జినుగు మరియన్న రైతులకు సూచించారు. మండలంలోని బడితండా, రత్తిరాంతండా, నెల్లికుదురు తదితర గ్రామాలల్లో సంబంధిత అధికారులతో కలిసి కూరగాయల సాగును పరిశీలించారు. జిల్లాలో 2,537 ఎకరాల్లో రైతులు కూరగాయల సాగు చేస్తున్నట్లు చెప్పారు.

వందశాతం ఫలితాలు సాధించాలి

కురవి: పాఠశాల విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని కిసాన్ పరివార్ సీఈఓ డాక్టర్ వివేక్ అన్నారు. శుక్రవారం సీరోలు మండలం కాంపల్లి జెడ్పీ హైస్కూల్‌లో గత మూడు నెలల క్రితం రూ.3లక్షల సాయం అందిస్తానని చెప్పిన మాట ప్రకారం ఆయన మొదటగా పాఠశాలకు ఫ్యాన్లను పంపిణీ చేశారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. కార్యక్రమంలో కిసాన్ పరివార్ సంస్థ మండలాల బాధ్యులు విష్ణునాయక్, ఎడెల్లి వెంకన్న, కారంపూడి వెంకటేశ్వర్లు, శివవర్మనాయక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటినుంచి అండర్ బ్రిడ్జి రాకపోకలు నిలిపివేత

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలో గల అండర్ బ్రిడ్జి రాకపోకలు శనివారం నుంచి వచ్చే నెల 25 వరకు నిలిపివేయనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. రైల్వే మూడో లైన్ నిర్మాణ పనుల్లో భాగంగా అండర్ బ్రిడ్జి పైభాగంలో నూతనంగా రైల్వే ట్రాక్ నిర్మాణం చేపడతారని తెలిపారు. వాహనదారులు సహకరించాలని సూచించారు.

షటిల్ పోటీలు ప్రారంభం

గార్ల: క్రీడలతో యువకుల్లో శారీరక మానసికోల్లాసంతోపాటు, దేహదారుఢ్యం పెంపొందుతుందని పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ అన్నారు. గార్లలోని జీవంజిపల్లి గ్రామంలో కత్తుల ఎల్లమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే షటిల్ పోటీలను శుక్రవారం రాత్రి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నిర్వాహకులు కత్తుల ప్రశాంత్, పల్లెపంగు నాగరాజు, జిలాని, పీఏసీఎస్ డైరెక్టర్ అశోక్, మోహిన్ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు ఎంపికలు

కురవి: మహబూబాబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో ఈనెల 26వ తేదీన సీనియర్ పురుషుల కబడ్డీ సెలక్షన్స్ ఉంటాయని జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు మద్ది వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంద వీరన్న శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. అర్హతలు, వయస్సుతో సంబంధం లేకుండా 85 కేజీల లోపు బరువు ఉండి ఓపెన్ క్యాటగిరి వారందరు పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు 91829 48067 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మహబూబాబాద్ అర్బన్: ఆడపిల్లలు యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అంతర్జాతీయ యోగా మాస్టర్, తెలంగాణ హైకోర్టు న్యాయవాది డాక్టర్ టి.వెంకట్‌రాజయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆరుద్ర వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, గిరిజ, శ్రీవాణి పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

మహబూబాబాద్ రూరల్: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మండలంలోని బోడగుట్ట తండా గ్రామంలో బోడగుట్ట తండా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బోడగుట్ట ప్రీమియర్ లీగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎమ్మెల్యే బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బయ్యారం పీఏసీఎస్ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి, నాయకులు అజ్మీర సురేష్, సుదర్శన చారి, సుందర్, తదితరులు పాల్గొన్నారు.

షూటింగ్‌బాల్ పోటీల్లో ప్రతిభ

కురవి: మండలంలోని నల్లెల్ల శివారు గాజితండా జీపీ పరిధిలోని టేకుల తండాకు చెందిన బానోత్ నరేష్ అనే యువకుడు జాతీయ స్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో తెలంగాణ తరపున పాల్గొని ప్రతిభ కనబర్చినట్లు క్రీడాకారుడు నరేష్ శుక్రవారం తెలిపారు. గత డిసెంబర్ 24 నుంచి 25 వరకు నల్లగొండలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని తెలంగాణ జట్టుకు ఎంపికయ్యాడు. ఈనెల 16 నుంచి 19 వరకు ఒడిషాలోని పూరిలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నట్లు ఆయన వివరించారు.

దరఖాస్తు చేసుకోవాలి

పెద్దవంగర: రైతు భరోసా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ స్వామినాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా పథకాన్ని ఈ నెల 26 నుంచి ప్రతిష్టాత్మకంగా చేపడుతుందని తెలిపారు. 1జనవరి 2025 నాటికి కొత్తగా పట్టాదార్ పాస్ పుస్తకం పొందిన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 30 వరకు చివరి గడువు అని సూచించారు.

వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని గిరిజన బాలుర పోస్ట్‌మెట్రిక్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బోడ రమేశ్ నాయక్ డిమాండ్ చేశాడు. వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని అధికారులకు వినతిపత్రం అందజేశారు. సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా హాస్టల్‌ను సందర్శించి నూతన మెనూను అమలు చేయకుండా విద్యార్థులు ఆకలితో ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు హతిరాంనాయక్, కార్యదర్శి హరినాయక్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మహబూబాబాద్ అర్బన్: ప్రతి వాహనదారుడు హెల్మెంట్, కారులో సీట్ బెల్ట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జిల్లా రవాణా శాఖ అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని ట్రాఫిక్ నియమాలపై, జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాసోత్సవాలు ఈనెల 31 వరకు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గణేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.